# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 218 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 02 సెప్టెంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# పెన్షన్లతో ఆర్థిక భరోసా



- కుటుంబంలో పెరిగిన గౌరవం ● ఇప్పటి వరకూ రూ. 75 వేల 503 కోట్ల పెన్షన్లు ఇచ్చాం ● వీటితో మూడు పోలవరాలు కట్టగలం ● మంచి కోసం సూచనలు,సలహాలు స్వీకరిస్తా ● అభివృద్ధిని అడ్డుకుంటున్న గొడ్డలిపార్టీ
- మీ దీవెనలు ఇలాగే ఉంటే ఇంకా అభివృద్ధి చేస్తా
- మొగల్తూరు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు

**భీమవరం,మన జనప్రగతి సెప్టెంబర్ 01:**పెన్షన్లతో పేద కుటుంబాల్లో భరోసా నింపామని సిఎం చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఆయా కుటుంబాల్లో పెద్దలకు గౌరవం దక్కుతోందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి డ్వాక్రా సంఘాలను స్థాపించామని సీఎం తెలిపారు. తన తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదని దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం మగవారితో సమానంగా ఆడవారు ఎదిగారని అన్నారు. భవిష్యత్తులో మగవారిని మించిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్పుకొచ్చారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఇస్తూ ఆదుకుంటున్నామన్నారు. దేశంలో నాలుగు వేలు, ఆరువేలు, పదివేలు, పదిహేను వేలు పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీనే అని అన్నారు. ఇప్పటి వరకూ 75 వేల 503 కోట్ల రూపాయలను పెన్షన్లు ఇచ్చామని.. ఆ డబ్బుతో మూడు పోలవరం ప్రాజెక్టులు కట్టవచ్చన్నారు. ఆర్థిక అసమానతలు పోవాలని.. అందరికీ సంక్షేమం అందాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నోసార్లు నరసాపురం వచ్చానని..అనేక పాలనా సంస్కరణలకు నాంది పలికామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మొగల్తూరులో లబ్దిదారులకు పెన్షన్లను పంపిణీ చేసిన అనంతరం మిగతా2లో...

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి


- బంగారాన్ని అనవసరంగా కొనకండి ● డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి ● దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు



**న్యూఢిల్లీ,మన జనప్రగతి సెప్టెంబర్ 01:** భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో మిగతా2లో...

# భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

- రష్యాతో డీల్ కుదుర్చుకోనున్న భారత్



**న్యూఢిల్లీ,మన జనప్రగతి సెప్టెంబర్ 01:** 'ఆపరేషన్ సిందూర్'లో సమర్ధవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని భారత రక్షణశాఖ నిర్ణయించి నట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించి నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్-400.. మిగతా2లో...

# విజయవాడ-అమరావతి మధ్య ఐకానిక్ బ్రిడ్జ్

- అమరావతికి నేరుగా ప్రయాణించేలా ప్రణాళిక
- వేయికోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం




# కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సానుకూలత

- 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన
- నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన
- సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రామ్మోహన్ నాయుడి హామీ




# ఎపిలో సర్ గడువు పొడిగింపు


- సెప్టెంబర్ 10వ తేదీ వరకు అవకాశం




**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 01:** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పొడిగించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి చేసిన అభ్యర్థన మేరకు ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో కీలక మార్పులు చేసింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాపై కెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు మిగతా2లో...

# చేనేతలకు సకాలంలో ఆప్కో చెల్లింపులు

- రెండేళ్లలో రూ.24.51 వస్త్రాలకు పేమెంట్లు
- మొదటి ఏడాది రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు
- రెండో ఏడాది కూడా పూర్తిస్థాయిలో చెల్లింపులు
- రూ.కోటీ 3 లక్షల మేర లివరీ బకాయిలు బ్యాంకు ఖాతాల్లో జమ



**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 01:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో చేనేత క్లస్లర్లు, టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేస్తూనే, మరోవైపు నేతన్నలకు 365 రోజులూ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆప్కో ద్వారా చేస్తున్న చేనేత వస్త్రాలకు మిగతా2లో...

# మత్స్యకారుల కుటుంబాలకు పింఛను పంపిణీ

మత్స్యకారులతో చంద్రబాబు మాటామంతీ



**నర్సాపురం,మన జనప్రగతి సెప్టెంబర్ 01:** పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం పర్యటించారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా మత్స్యకారుల కుటుంబాలకు పింఛను పంపిణీ చేశారు. వేటకు వెళ్లే ఫెర్రీ పాయింట్‌కు ముఖ్యమంత్రి మొదట చేరుకున్నారు. పడవల వద్ద కూర్చున్న పలుగురు మత్స్యకారులతో ముచ్చటించారు. తిరుమని స్వామి మిగతా2లో...

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
02- 09 - 2026

# పెన్షన్లతో ఆర్థిక భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడుతూ.. తనకు మొగల్తూరు కొత్తేమీ కాదన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రజా కార్యక్రమాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని విమర్శించారు. అటువంటి పరిస్థితి నుంచి 94 శాతం సీట్లలో, 54 శాతం ఓట్లతో కూటమిని ప్రజలు గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఇంకా బాగా జరగాలి.. అందుకోసం సలహాలు, సూచనలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సంక్షేమం పేదవాడిని నిలబెట్టాలి.. తాత్కాలిక ఉపశమనం ఉండాలన్నారు. చైనా సామెతను ఉదాహరిస్తూ..చేపలు అందించడం కాదు..చేపలు పట్టించడం నేర్పాలని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం సమృద్ధి సాధించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. ఆడ బిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా.. ఉచిత బస్సులు తెచ్చాం. దీపం పథకం ద్వారా 3 సిలిండర్లు ఇస్తున్నాం. పేదల సేవ కోసమే మొగల్తూరు వచ్చాను. సీఎం స్థాయిలో అనేక మార్పులు చేశాను. ఎంత సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను. అనేక సంస్కరణలకు నాంది పలికాం.. ప్రజా చైతన్య కార్యక్రమాలు తెచ్చాం. ఎన్నికల్లో మీరిచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేను. వైకాపా హయాంలో రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. కూటమిగా ఏర్పడి రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. 45 సంవత్సరాలుగా వెనుకబడిన వర్గాలు తెదేపాని అంటిపెట్టుకునే ఉన్నాయి. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. త్వరలో మహిళా డ్రైవర్ల వ్యవస్థను తీసుకొస్తాం. వడ్డెర సమాజిక వర్గానికి మైనింగ్ లీజులు పెట్టాం. గౌడ్ కులానికి మద్యంషాపులు కేటాయిస్తున్నాం. డీఎస్సీపై వైకాపా 350 కేసులు వేసింది. వైకాపా చేస్తోన్న ప్రచారాన్ని డీఎస్సీ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు పెంచాం. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా ఉంటుందని చంద్రబాబు అన్నారు. కొన్ని రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని.. వాటిని మహిళలు నడపాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. డ్వాక్రా ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యేలా చూస్తామని చెప్పారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఆర్థిక సహాయాన్ని ఇవ్వడాన్ని తానే ప్రారంభించానని తెలిపారు. ఎలాంటి మంచి పనులు చేసినా అడ్డుపడుతున్నారని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ఏజెన్సీలోని పిల్లలకు మెరుగైన విద్య అందిస్తే, ప్రపంచంలోనే మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. వాటన్నింటికీ గొడ్డలి పార్టీ అడ్డుపడుతోందని విమర్శించారు. 'ఎంత అడ్డుపడినా నా ఆశయాన్ని ఆపలేరు' అని స్పష్టం చేశారు. డీఎస్సీని అడ్డుకోవడానికి 350 పిటిషన్లు వేశారని.. పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తే, కోడిగుడ్డుకు ఈకలు పీకుతున్నట్లు వ్యవహరిస్తున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన వారు గొడ్డలి పార్టీని హెచ్చరించినా వారిలో మార్పులేదన్నారు. త్వరలో ఏసీ బస్సులు వస్తున్నాయని.. మహిళలు ఉచితంగా ఆ బస్సుల్లో ఎక్కే రోజులు రాబోతున్నాయని తెలిపారు. మహిళలు ఇంటిపైన సోలార్ పెట్టుకుంటే విద్యుత్ తయారు అవుతుందని.. దానివలన కొన్ని రోజుల్లో ఉచితంగా కరెంటు పొందవచ్చని సూచించారు. వేసవికాలంలో ఎండలు ఎక్కువ ఉంటాయి కాబట్టి.. ఏసీలు పెట్టుకోవచ్చని.. అదనంగా ఉండే విద్యుత్‌ను అమ్ముకోవచ్చ న్నారు. ప్రతి ఇంట్లో ఒక చిన్న పారిశ్రామికవేత్త రావాలని వన్ హౌస్- వన్ ఆంత్రప్రెన్యూర్ అనే పథకాన్ని తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. అందరూ ప్రయత్నం చేస్తే మార్పు ఖచ్చితంగా వస్తుందని.. అనుకుంటే సాధించగలుగుతారని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే 5 లక్షల 90 వేలు ఇళ్లు పూర్తి చేశామని.. మరో అయిదు లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అప్పట్లో పరిశ్రమలను పారద్రోలారని.. కూటమి అధికారంలోకి వచ్చాక 22 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బుధవారం గోదావరి నీటిని ఉత్తరాంధ్రకు తీసుకెళ్లబోతున్నామని.. చరిత్రను మార్చబోతున్నామని తెలిపారు.

# విజయవాడ-అమరావతి మధ్య ఐకానిక్ బ్రిడ్జ్

**విజయవాడ,మన జనప్రగతి సెప్టెంబర్ 01:** విజయవాడ నుంచి అమరావతికి మరో రాజబాటకు అడుగులు పడుతున్నాయి.. కృష్ణా నదిపై అంతర్జాతీయ ప్రమాణాలతో , సిగ్నేచర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.. కేవలం రాకపోకలకు మాత్రమే కాకుండా.. అమరావతికి, ఐకానిక్ ల్యాండ్ మార్క్‌గా నిలిచేలా ఈ వంతెనను తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది.. 1000 కోట్ల ప్రతిపాదనతో రెడీ అవుతున్నట్లు సమాచారం. ఇప్పటివరకు విజయవాడ నుంచి, అమరావతిలోకి రావాలంటే ,వారధి లేదా, ప్రకాశం బ్యారేజీ మీదుగా రాజధాని ప్రాంతానికి చేరుకోవాలి. పెరుగుతున్న వాహనాలతో, ఈ బ్రిడ్జిలపై ప్రయాణ సమయంలో, తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటివరకు అయితే కొంత పర్లేదు గాని.. మరొక రెండు మూడు సంవత్సరాలు గడిస్తే , అమరావతిలో పూర్తిస్థాయిలో రాకపోకలు ప్రారంభమైతే, ఈ రెండు బ్రిడ్జిలు మీద రాకపోకల వల్ల ట్రాఫిక్ తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో.. వెయ్యి కోట్లతో భారీ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నడుం బిగించింది. ఈ బ్రిడ్జి నిర్మాణంతో విజయవాడ నుంచి రాజధాని అమరావతికి రాకపోకలను మరింత సులభతరం చేయడంతో పాటు..

రాజధాని అభివృద్ధిలో ఈ బ్రిడ్జిని కీలక మౌలిక వసతిగా మార్చాలని ప్రభుత్వం భావిస్తుంది. రాజధాని అవసరాలతో పెరిగిన ట్రాఫిక్ తో ఇబ్బం దులు పడుతున్న ప్రజలకు, ఇబ్బందులు తొలగించడంతోపాటు, పర్యాటక ప్రాజెక్టుగా కూడా దీన్ని మార్చాలన్న ఆలోచనతో అధికారులు ప్రణాళికలు వేస్తున్నారు అని సమాచారం. ప్రతిపాదిత సిగ్నేచర్ ఐకానిక్, బ్రిడ్జి ప్రకాశం బ్యారేజీ, రైల్వే బ్రిడ్జిల మధ్య ప్రాంతంలో నిర్మించేలా ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. సీతానగరం ఘాట్ వైపు నుంచి కనకదుర్గ ఫ్లై ఓవర్ దిశగా.. అక్కడి నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డుతో అనుసంధానం కల్పించేలా ప్రాజెక్టును ప్రతిపాదించారు.

తెలుగు సంస్కృతికి ప్రతీకగా నిలిచే కూచి పూడి నృత్య భంగిమల స్ఫూర్తితో, ఐకానిక్ డిజైన్ రూ పొందించే అవకాశంపైనా చర్చ జరుగుతోంది. పర్యా టకంగా కూడా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు, ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులను, అంతర్జా తీయ ఆర్థిక సంస్థల నుంచి సమీకరించే అవకాశా లను పరిశీలిస్తున్నారు.

ప్రస్తుతం ఫీజిబిలిటీ రిపోర్ట్, డీపీఆర్ తయారీ కోసం కన్సల్టెంట్ ఎంపిక పక్రియ కొనసాగుతోంది. రాజధాని కనెక్టివిటీని పెంచడంతో పాటు.. అమరావతి స్కైలైన్‌లో మరో ప్రత్యేక నిర్మా ణంగా ఈ బ్రిడ్జి నిలిచేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సానుకూలత

**న్యూఢిల్లీ,మన జనప్రగతి సెప్టెంబర్ 01:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది. న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు. ÷ంద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గుర్తుచేసుకున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.


# మత్స్యకారుల కుటుంబాలకు పింఛను పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

అనే మత్స్యకారునికి స్వయంగా సీఎం పింఛను సొమ్మును అందజేశారు. వారి కుటుంబాల యోగక్షేమాలు, సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే పథకాల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. వేట సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను కూడా సీఎం అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో మత్స్యకారులు గల్లంతవుతున్న ఘటనలపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల దాదాపు 20 రోజుల పాటు సముద్రంలో కనిపించకుండా పోయిన కోనసీమకు చెందిన మత్స్యకారులను సురక్షితంగా తిరిగి తీసుకురావడంలో కోస్ట్‌గార్డ్, నేవీ, కేంద్ర మెరైన్ విభాగాల సహకారం తీసుకున్న విషయాన్ని సీఎం వారికి వివరించారు. మత్స్యకారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరును సీఎం చంద్రబాబు వారిని అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల సేవలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న రూ.20 వేల ఆర్థిక సాయం వేట నిషేధ సమయంలో తమను ఆదుకుంటోందని మత్స్యకారులు సీఎంకు తెలిపారు. ఈ సమయంలోనే తమతో పాటు పడవలోకి రావాలని ఓ మత్స్యకారుడు సీఎంను ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు మత్స్యకారులతో కలిసి బోటులో ప్రయాణించారు. సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు రోజువారీ జీవితం ఎలా ఉంటుంది? ఎన్ని గంటలు సముద్రంలో ఉండాలి? ఆ సమయంలో భోజనం ఎలా చేస్తారు? వంటి విషయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు.

# ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

● మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్




**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 01:** ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున అందుబాటులోకి రానున్న ఏసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొగల్తూరులో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పింఛన్ల రూపంలోనే ప్రజలకు రూ. 73,000 కోట్లు అందించినట్లు గుర్తుచేశారు. మహిళలు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి కష్టాలను తీర్చేందుకే 'దీపం' పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు. ఇదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఏకంగా 350 కేసులు వేశారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో అభివృద్ధిని ఆపలేరని హితవు పలికారు. కేవలం ప్రజల ప్రయోజనాల కోసమే కూటమి పార్టీలు ఏకమయ్యాయని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుకు సాగుతోందని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

(మొదటి పేజీ తరువాయి)

దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్-400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్-400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్-400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్-400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం.. భారత్ మొత్తం 5 ఎస్-400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు 4 యూనిట్లు భారత్‌కు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో 5 యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.


# ఎపిలో సర్ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం కల్పించింది. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నా, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోయినా ఈ గడువులోగా ÷-లకెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని అధికారులు తెలిపారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు అక్టోబర్ 5వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఎస్ఐఆర్ పక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలోని ఓటర్ల జాబితా సవరణ పక్రియకు సంబంధించి ఈ తేదీలు మారాయి. సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను వెంటనే రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే షెడ్యూల్‌లో చేసిన మార్పులపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి సూచించింది.ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. పేరులో తప్పులు, చిరునామా మార్పులు లేదా ఇతర వివరాల్లో సమస్యలు ఉంటే నిర్ణీత గడువులోగా కెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించి సవరించుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# చేనేతలకు సకాలంలో ఆప్కో చెల్లింపులు

(మొదటి పేజీ తరువాయి)



సంబంధించిన కొనుగోళ్లకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ చేనేత సహకార సంఘాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. 2019-24 మధ్య నాటి ప్రభుత్వం ఆప్కో ద్వారా చేసిన కొనుగోళ్లకు సంబంధించి చెల్లింపులు ఏనాడూ సకాలంలో చేయలేదు. దీనివల్ల చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు పెరుగుతూ రాసాగాయి. దీనివల్ల చేనేత సంఘాలపై విపరీతమైన ఆర్థిక భారం పడసాగింది. చెల్లింపులు నిలిచిపోవడంతో నేతన్నలు కుటుంబాలు అర్ధాకలితో అలమటించసాగాయి. నేతన్నల కష్టాలను సీఎం చంద్రబాబునాయుడు, పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ తెలుసుకుని, అధికారంలోకి రాగానే, ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు తక్షణ చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. సకాలంలో కొనులు చేసిన వస్త్రాలకు చెల్లింపులు చేయడం ద్వారా చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా ఉండడంతో పాటు నేతన్నలకు నిత్యం ఉపాధి లభించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ వస్తోంది. లివరీ చెల్లింపులు సైతం చేస్తూ, చేనేత సహకార సంఘాలకు ఆసరాగా ఉంటోంది. చేనేతలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఇందులో భాగంగా ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఏప్రిల్ 2024 నుంచి ఏ నెల కానెల చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. మొదటి ఏడాది చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో అధికారులు 18,03 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేశారు. ఇందుకు గానూ రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు చేశారు. రెండో ఏడాదిలో కూడా పూర్తిస్థాయి చెల్లింపులు చేశారు. ఈ ఏడాది మార్చి వరకూ రూ.6.61 కోట్ల వస్త్రాలను చేనేత సంఘాల నుంచి కొనుగోలు చేయగా, పూర్తి స్థాయిలో ఆ సంఘాలకు చెల్లింపులు చేశారు. రెండేళ్లలో రూ.24.51 కోట్లను చెల్లించి, చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా, నేతన్నలకు నిత్యం ఉపాధి ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
02- 09 - 2026

# లబ్దిదారుల ముంగిటకే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

**● జిల్లాలో సెప్టెంబర్ మాసంలో 2,33,431 మందికి రూ.102.48 కోట్ల రూపాయల పెన్షన్లు పంపిణీ: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**



**కర్నూలు బ్యూరో గోనెగండ్ల మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**లబ్దిదారుల ముంగిటకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అన్నారు. సెప్టెంబర్ మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 33 వేల 431 మంది లబ్దిదారులకు రూ. 102.48 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా గోనెగండ్ల మండల కేంద్రంలోని లక్ష్మీ పేటలో నవీన్, రాజేష్ లకు వైకల్య పెన్షన్, ఈశ్వరయ్య, జానకమ్మ, చంద్రయ్య, నాగేష్ లకు వృద్ధాప్య పెన్షన్ లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్దిదారులకు పెన్షన్ లను పంపిణీ చేస్తూ ఇంట్లో వారు ఎలా చూసుకుంటున్నారు,ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ ప్రతి నెల సరైన సమయానికి అందిస్తున్నారా,పెన్షన్ ఇచ్చేటపుడు డబ్బులు అడుగుతున్నారా,పంపిణీ చేసే అధికారుల ప్రవర్తన ఎలా ఉంది అని కలెక్టర్ ఆరా తీశారు. పెన్షన్ లను లబ్ధిదారులకు అందచేయడంలో తొలిరోజే 100 శాతం పెన్షన్ పంపిణీ చేయాలని కలెక్టర్ డిఆర్డిఎ పిడి ని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి శ్రీధర్ రావు,ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, ఎంపీడీఓ మణి మంజరి,ఇంచార్జి తహసిల్దార్ రఘువీర పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా.. ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు




**దేవనకొండ మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలనే లక్ష్యంతో దేవనకొండ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జ్యోతి, డిప్యూటీ ఎంపీడీఓ గోపాల్, ఎంఈఓ భాషా మాట్లాడుతూ.. యువత గంజాయి, మద్యం, సిగరెట్లు తదితర మత్తు పదార్థాలకు ఆకర్షితులై ఆరోగ్యం, విద్య, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 'మత్తుకు దూరంగా.. భవిష్యత్తుకు దగ్గరగా' అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి ఆచరించాలని టీడీపీ యువ నాయకుడు కాకర్ల శాంతికుమార్ కోరారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల సిబ్బంది, దేవనకొండ అభివృద్ధి కమిటీ సభ్యులు ఉప్పర కృష్ణమూర్తి, కాకర్ల శాంతికుమార్, సాయి, ప్రకాష్, సుమంత్, నవీన్, నాని, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి


**- మండల వ్యవసాయ అధికారి బి. ఉషారాణి**



**దేవనకొండ మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**దేవనకొండ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి. ఉషారాణి సూచించారు. రైతులు తమ ఆధార్ కార్డును తీసుకుని సంబంధిత రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈకేవైసీ చేయించుకోని రైతులకు పంట బీమా, కరువు పరిహారం, ఎరువుల సరఫరా, బ్యాంకు పంట రుణాలు తదితర ప్రయోజనాలు అందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. అందువల్ల రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రంగన్న, అబ్దుల్ సలాం, మల్లికార్జున, వ్యవసాయ విస్తరణ అధికారి కళావతి, రైతులు పాల్గొన్నారు.

# పెన్నాలో అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు

**- యంత్రాలతో తవ్వకాలకు అనుమతులు లేవు: తహసీల్దార్ విజయ్‌కుమార్**



**సిద్ధవటం మనజనప్రగతి సెప్టెంబర్ 01:-**పెన్నా నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా యంత్రాల ద్వారా ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని సిద్ధవటం మండల తహసీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం సిద్ధవటంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని సిద్ధవటం, మూలపల్లి, రాజంపేట, వంతాటిపల్లి, మాచుపల్లి, గాండ్లపాలెం, దేగనవాండ్లపల్లె గ్రామాల పరిధిలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఉచిత ఇసుక విధానం ముసుగులో కొందరు అక్రమంగా యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన చోట్ల రహదారులను పూడ్చివేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదగాలి

**పీఎంఈజీపీ,పీఎంఎఫ్ఎంఈ పథకాల ద్వారా ఏర్పాటు చేసిన యూనిట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. మంగళవారం గోనెగండ్ల మండల కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి పరిశీలించారు. పీఎంఈజీపీ కింద ఏర్పాటు చేసిన ఏ-4 పేపర్ కటింగ్ యూనిట్, పీఎంఎఫ్ఎంఈ కింద నిర్వహిస్తున్న పిండి మర, స్వయం సహాయక సంఘాల రుణాలతో ఏర్పాటు చేసిన అస్మా శారీస్ దుకాణాన్ని కలెక్టర్ సందర్శించి, వాటి నిర్వహణ, ఉత్పత్తి, విక్రయాలు, ఆదాయం, రుణాల చెల్లింపులు తదితర అంశాలపై లబ్దిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు, సబ్సిడీలు పొందిన లబ్ధిదారులు యూనిట్లను సమర్థవంతంగా నిర్వహించి స్థిరమైన ఆదాయం పొందేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఉత్పత్తి వ్యయం, మార్కెటింగ్,విక్రయాలు, రుణ వాయిదాల చెల్లింపులపై నిరంతరం పర్యవేక్షణ ఉంచి యూనిట్లను లాభదాయకంగా తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని యువత, మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అరుణా దేవి, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రావు, ఉప తహసిల్దార్ రఘువీర్, ఎంపీడీవో మణి మంజరి, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఎన్టీఆర్ భరోసా పెన్షనే ఒక్కటే ఆసరా

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రతినెలా 1వ తేదీన పెన్షన్ అందజేస్తున్నాం:బత్తిన రాజశేఖర్**



**పత్తికొండ మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పేదలకు ఎంతో భరోసాగా నిలుస్తోందని నలకదొడ్డి టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రతినెలా 1వ తేదీన పెన్షన్ అందజేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం పత్తికొండ మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే కేఈ. శ్యామ్‌కుమార్, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకనాథ్ ఆదేశాల మేరకు గ్రామ అధికారులతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బత్తిన రాజశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పెన్షన్ అందజేస్తుందని పేర్కొన్నారు. పెన్షన్‌దారులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ అందజేస్తుండటంతో తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఇతరులపై ఆధారపడకుండా జీవించేందుకు పెన్షన్ తోడ్పడుతోందని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కేఈ. శ్యామ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఘుశేఖర్, శీను, దశరథ్, సురేంద్ర, నర్సప్ప, గ్రామ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవల్లో.. సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకం

**- సమాచార శాఖ జోన్-4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్**





**కడప మన జనప్రగతి సెప్టెంబరు 01:** - అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకమని జోన్-4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మంగళవారం కడపలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని.. జోన్-4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ తనిఖీ చేశారు. కార్యాలయంలోని పరిపాలనా అంశాలను పరిశీలించి, శాఖాపరంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలు, సిబ్బంది విధులపై వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమావేశమై వారి విధులు, బాధ్యతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యంగా అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, వాటి ప్రయోజనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాలు సమాచార వ్యాప్తికి కీలక వేదికలుగా మారాయని, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వాటిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా సమాచారాన్ని అందించాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని కోరారు. జోన్-4 పరిధిలో సమాచార శాఖను మరింత పటిష్టం చేయడంతో పాటు పాత్రికేయులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సిబ్బంది తమ విధులను బాధ్యతతో నిర్వర్తిస్తూ శాఖ ప్రతిష్ఠను పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏడి రమేష్, డీఇఇ శ్రీనివాసరావు, పిఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా తదితరులు ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు సదాశివయ్య, ఫోటోగ్రాఫర్ సోహైల్, టైపిస్టులు శ్రీవాణి, వర్ధిని, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీపతి, అజ్మతుల్లా, టీఏ హరిబాబు, వీరారెడ్డి, విజయ కుమారి, షాహీనా బేగం, ముంతాజ్ బేగం, సునీత, సుభాషిణి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలి

**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 01:-** వాణిజ్యపరంగా కీలకమైన ప్రొద్దుటూరు పట్టణం, పరిసర గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ప్రొద్దుటూరు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జేసీ డా. నిధిమీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రహదారులు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, గ్రామీణ అనుసంధాన రహదారుల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్షించారు. ప్రొద్దుటూరులో సుమారు రూ. 600 కోట్లతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, 24 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని సూచించారు. కొత్తపల్లి ప్రాంతంలో శుద్ధి కేంద్రానికి భూమి గుర్తింపు, అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల హాజరుకు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు టౌన్ ప్లానింగ్ నిబంధనలపై అవగాహన కల్పించాలని తెలిపారు. హౌసింగ్ శాఖపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. మైలవరం జలాశయం నుంచి తాగునీటి సరఫరాను మెరుగుపరచడంతో పాటు అమృత్ పథకాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని సూచించారు. చౌదూరు వద్ద ఎంఎస్ఎంఈ పార్కులో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్యుత్, పారిశుధ్య సదుపాయాలను మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పలు సూచనలు చేశారు.

# పాత రైల్వే ఓవర్ బ్రిడ్జి ఫిల్లర్‌ను పరిశీలించిన మంత్రి దుర్గేష్

**నిడదవోలు,మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**

నిడదవోలు పట్టణంలోని పాత రైల్వే ఓవర్ బ్రిడ్జి కాలిబాట వంతెన శిథిలమైన ఫిల్లర్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం స్వయంగా పరిశీలించారు. ఫిల్లర్ ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా తక్షణమే మరమ్మత్తు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజా భద్రత విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి ఆదేశాల మేరకు పునరుద్ధరణ పనులు వెంటనే చేపడతామని అధికారులు తెలిపారు.



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
02- 09 - 2026

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

**- జంగాలపల్లెలో ఎస్సై హారిక పల్లెనిద్ర**



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 01:-**రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మండల పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని జంగాలపల్లె ఎస్సీ కాలనీలో ఎస్సై హారిక ఆధ్వర్యంలో పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్సై హారిక మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పల్లెనిద్ర చేపట్టి స్థానికులకు ఎన్నికలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరైనా చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గొడవలు, వర్గ విభేదాలు, ఘర్షణలకు తావివ్వకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజా జీవనానికి భంగం కలిగించేలా అలజడులకు పాల్పడే వారిపై ఎంతటి వారైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

**- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్**



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 01:-** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అమరావతి జేఏసీ పిలుపు మేరకు మంగళవారం సిద్ధవటం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన డీఏలు, ఐఆర్, పీఆర్సీ తదితర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## గుణకనపల్లి గ్రామ రామాలయంలో చోరీ

**- లింగాల పోలీసులకు సవాల్ విసిరిన దొంగలు**



**లింగాల మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**మండల పరిధిలోని గుణకనపల్లి గ్రామం మధ్యలో ఉన్నటువంటి రామాలయంలో సోమవారం రాత్రి ఇరువురు వ్యక్తులు దేవాలయం తాళాలు పగలగొట్టి సుమారు రెండు లక్షల రూపాయలు విలువ చేసే సీతా సమేత శ్రీరామలక్ష్మణుల విగ్రహాల కిరీటాలు దొంగలించారు. అనంతరం గ్రామం లోని పాతబడి అరుగుపై ఉన్న రైతుల ట్రాన్సార్మర్ల లోని రాగి వైరుని కూడా దొంగలించేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో గ్రామంలోని రైతులు తమ పొలం వద్ద బోర్ వేస్తుండడంతో ఇంటి వద్ద నుంచి పొలం వద్దకు వెళుతుండగా ఇరువురు మోటార్ సైకిల్ పై పారిపోవడం గమనించారు. ఇటీవల ఇప్పట్ల, ఇంటేపల్లె పొలాలలో రైతుల మోటార్ల కేబుల్ వైర్లను కూడా దొంగలు దొంగిలించడం జరిగింది. గుణకనపల్లె గ్రామంలో మధ్యలో వెలసిన శ్రీరామాలయంలో దొంగతనం చేయడంతో తమను చేతనైతే పట్టుకొండని లింగాల పోలీసులకు దొంగలు సవాల్ విసిరినట్లైంది. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ సిద్దార్థ తన సిబ్బందితోపాటు క్లూస్ టీం తో కలిసి మంగళవారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించి , గ్రామస్తులతో సంఘటన జరిగిన తీరుపై సమాచారాన్ని తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శ్రీరాములుకు ఘన సన్మానం



**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 1:-**రాయచోటి మండలం మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లూరు శ్రీరాములు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రియాజ్, మండల విద్యాశాఖ అధికారులు బాలాజీ నాయక్, నాగముని రెడ్డి ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బాలాజీ నాయక్ మాట్లాడుతూ...శ్రీరాములు మృదుస్వభావి అని, ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ స్నేహితుడిగా ఉంటూ తన విధులను ఎలాంటి సమస్యలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. మండల విద్యాశాఖ అధికారి-2 నాగముని రెడ్డి మాట్లాడుతూ, అప్పగించిన ఏ పనినైనా కాదనకుండా బాధ్యతగా పూర్తి చేసి మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తి శ్రీరాములు అని అన్నారు. ప్రధానోపాధ్యాయులు రియాజ్ మాట్లాడుతూ, శ్రీరాములు నిరంతరం శ్రమిస్తూ తన విధుల పట్ల అంకితభావంతో పనిచేశారని, ఆయన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.టి.యు అధ్యక్షులు శివారెడ్డి, ఆపస్ సభ్యులు ఎన్.శ్రీనివాసులు, ఎన్.టి.ఏ అధ్యక్షులు అమరా, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొని శ్రీరాములుకు శుభాకాంక్షలు తెలిపారు.

## నడి రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్.. ప్రజలకు అవస్థలు

- **రోడ్డు నిర్మాణానికి ఆటంకం..**
- **ప్రమాదం పొంచి ఉందంటున్న మాధవరం-1 గ్రామస్థులు**



**సిద్దవటం మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**మండలంలోని మాధవరం-1 రోడ్డు నంబర్ 12లో రహదారి మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసి అవతలి వైపునకు కలపలేని పరిస్థితి నెలకొంది. గ్రామం ఏర్పాటైన సమయంలో నడి వీధిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఏళ్లు గడిచినా అక్కడి నుంచి తొలగించకపోవడంతో రాకపోకలకు ఆటంకంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో రాకపోకలు లేక దారంతా చెట్లు, పొదలతో నిండిపోయి అడవిని తలపిస్తోందని, వర్షపు నీరు నిలిచి వాహనాలు, పాదచారులు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతూ సోమవారం విద్యుత్ అధికారులకు చరవాణి ద్వారా స్థానికులు వినతి తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి రహదారి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## చలో ఖమ్మం సభను విజయవంతం చేయండి

- **రాష్ట్ర విహెచ్ పిఎస్ అధ్యక్షులు చిన్న సుబ్బయ్య యాదవ్**



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**5వ తేదీ తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో జరిగే వికలాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలో జాతీయ సమావేశం జరుగుతుందని రాష్ట్ర వికలాంగుల సమితి అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య మంగళవారం వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై దశ ,దిశ నిర్దేశం చేయడానికి ఒక జాతీయ సమావేశాన్ని ఖమ్మం పట్టణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 77 వెంటనే రద్దు చేయాలి. వికలాంగుల వివాహాలను ప్రోత్సహించాలి. స్థానిక సంస్థ ఎన్నికల్లో వికలాంగులకు నాలుగు పర్సెంట్ రిజర్వేషన్ అమలు చేయాలి. బ్యాక్ లాక్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. ప్రతి మండలంలో వికలాంగులకు స్థలాలను కేటాయించాలి. గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పనిచేసిన వికలాంగుల కాంట్రాక్టు ఉద్యోగులకు పింఛన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు ఇంచార్జి ఓబయ్య, నగర అధ్యక్షులు ప్రసాద్ ,రాజయ్య ,మహిళా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై పర్యవేక్షణ నిరంతర నిఘా: ఉండాలి.జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**ఇసుక అక్రమ రవాణాపై నిరంతర నిఘా, పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి డా.ఏ.సిరి గనుల శాఖ డిడి ని ఆదేశించారు. మంగళవారం నందవరం మండల ంలోని గంగవరం,జోహరాపురం ఇసుక రీచ్ల ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రీచ్ నుండి బిల్స్ లేకుండా రవాణా జరుగుతోందన్న ఆరోపణల నేపథ్యంలో ప్రతి డిస్పాచ్‌ను ప్రత్యేకంగా ధృవీకరించాలని,రోజువారీగా జరిగే రవాణాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ గనుల శాఖ డిడి ని ఆదేశించారు..ఇసుక రీచ్‌ల నుంచి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న ఆరోపణలపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని ఆర్డీఓ అరుణ దేవి,మైనింగ్ శాఖ డిడి నాగిని,తహసిల్దార్ వాహబ్, ఎంపిడిఓ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గాన గంధర్వుడి ప్రశంసలు అందుకున్న పీలేరు గాయకుడికి ఘన సన్మానం







**పీలేరు మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**అన్నమయ్య జిల్లా పీలేరు ఇందిరానగర్‌కు చెందిన ప్రముఖ గాయకుడు, అడ్వకేట్ దిగళా మోహన్ రాజుకు విజయవాడలో ఘన సన్మానం లభించింది. న్యాయవాద వృత్తితో పాటు సంగీతంపై ఆసక్తితో పలు టెలివిజన్ పాటల పోటీ కార్యక్రమాల్లో పాల్గొని గాన ప్రతిభను చాటుకున్నారు. గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నుంచి ప్రశంసలు అందుకోవడం తన సంగీత ప్రస్థానంలో మరపురాని అనుభూతి అని మోహన్ రాజు తెలిపారు. విజయవాడలో అమ్మ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మధుర సుమ స్వరాంజలి' వార్షికోత్సవంలో ఆయన రెండు మధురమైన సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఆయన పాటలకు సభికుల నుంచి విశేష స్పందన లభించింది. అనంతరం నిర్వాహకులు, కళాకారులు,సంగీతాభిమానులు శాలువా,జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. సంగీతం తన జీవితంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని, వృత్తితో పాటు గానంపై ఉన్న ఆసక్తిని కొనసాగిస్తూ మరింతగా రాణించేందుకు కృషి చేస్తున్నట్లు మోహన్ రాజు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు స్వరాంజలి వెంకటేష్, అమ్మ ఆర్ట్స్ పత్తెం వెంకన్న తదితరులు ఆయనను అభినందించారు. గాయకుడు రసూల్ బాబు సహా పలువురు కళాకారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చంద్రబాబు మరో 15 ఏళ్లు సీఎంగా కొనసాగాలి

- **దేశంలోని ముఖ్యమంత్రులకు**

**ఆయన ఆదర్శం: కొమరా వెంకట నరసయ్య**



**ఒంటిమిట్ట మన జనప్రగతి సెప్టెంబరు 01:-**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 31 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను రాష్ట్ర మాజీ డైరెక్టర్, ఒంటిమిట్ట మండల టీడీపీ సీనియర్ నాయకుడు కొమరా వెంకట నరసయ్య ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు మరో 15 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. పరిపాలనా దక్షతతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నడిపిస్తూ దేశంలోని ఇతర ముఖ్యమంత్రులకు చంద్రబాబు మార్గదర్శిగా నిలవడం రాష్ట్ర ప్రజలకు గర్వకారణమన్నారు. గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పారిశ్రామిక, విద్యా, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులు, అభివృద్ధి వేగం పుంజుకున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగ అవకాశాలు రానున్నాయని, ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని వెంకట నరసయ్య అన్నారు. పలు రాజకీయ అవరోధాలను అధిగమిస్తూ అన్ని వర్గాల ప్రజలకు నిష్పాక్షిక, పారదర్శక పాలన అందించేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. మరో ఐదేళ్లలో సువర్ణాంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఐటీ రంగానికి గతంలోనే ప్రాధాన్యం కల్పించిన చంద్రబాబు, ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై దృష్టి సారించడం భవిష్యత్ తరాలకు ఎంతో ప్రయోజనకరమని వెంకట నరసయ్య పేర్కొన్నారు. దేశ, విదేశాల్లో పరిపాలనా దక్షతతో గుర్తింపు పొందిన చంద్రబాబు అందరికీ ఆదర్శంగా నిలిచారని ఆయన అన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు రాజకీయ అవకాశాలు లభించేనా..?



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, అభివృద్ధి, సమాన అవకాశాల గురించి ప్రభుత్వాలు పదేపదే హామీలు ఇస్తున్నప్పటికీ, రాజకీయ రంగంలో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించే విషయంలో మాత్రం ఇప్పటికీ స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షులు డా. మల్లు సుబ్బనరసారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పుల్లంపేటలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నాయి, హామీలు మారుతున్నాయి కానీ విభిన్న ప్రతిభావంతుల రాజకీయ అవకాశం మాత్రం ఎప్పటికీ నెరవేరని కలగానే మిగిలిపోవడం బాధాకరమని ఆయన అన్నారు. సమాజంలో విద్య,ఉపాధి,క్రీడలు,వ్యాపారం,సామాజిక సేవతో పాటు అనేక రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటున్న విభిన్న ప్రతిభావంతులకు రాజకీయాల్లో మాత్రం ఎందుకు సముచిత అవకాశాలు కల్పించడం లేదని ప్రభుత్వాన్ని,రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని విభిన్న ప్రతిభావంతులకు రాజకీయ అవకాశాలు కల్పించే విషయంలో ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మాటల్లో ప్రోత్సాహం, వేదికలపై హామీలు ఇవ్వడం మాత్రమే కాకుండా,స్థానిక సంస్థల ఎన్నికల్లో అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు టికెట్లు కేటాయించి, నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారా నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం అందించాలని కోరారు. విభిన్న ప్రతిభావంతులు దయకు పాత్రులు కాదు, అవకాశాలకు అర్హులు అని డా.మల్లు సుబ్బనరసారెడ్డి స్పష్టం చేశారు. వారికి సానుభూతి చూపడం కంటే, వారి సామర్థ్యాన్ని గుర్తించి సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలపై ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యలను వారు స్వయంగా రాజకీయ వేదికలపై ప్రస్తావించే అవకాశం కల్పించినప్పుడే వారి అభివృద్ధికి మరింత బలమైన మార్గం ఏర్పడుతుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి వర్గానికీ సముచిత భాగస్వామ్యం ఉండాలని, విభిన్న ప్రతిభావంతులను రాజకీయంగా ప్రోత్సహించడం ద్వారా సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం ముందడుగు వేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, విభిన్న ప్రతిభావంతుల రాజకీయ భాగస్వామ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు సముచిత అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
02- 09 - 2026

# ఇండిపెండెంట్‌గా పోటీ చేద్దాం...
# వరదకు రాచమల్లు ఓపెన్ ఛాలెంజ్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తనపై చేస్తున్న విమర్శలకు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఘాటుగా స్పందించారు.మంగళవారం దొరసానిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వయస్సుకు, వేషానికి, మాటలకు పొంతన లేదని, అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. చల్లా రాజగోపాల్ యాదవ్ తనకు మిత్రుడేనని, అయితే తన కుటుంబ గౌరవానికి భంగం కలిగించేలా ఆరోపణలు చేయడంతోనే ఆయనపై తీవ్రంగా స్పందించానని రాచమల్లు స్పష్టం చేశారు. తాను బీసీలను కించపరచలేదని, కేవలం రాజగోపాల్ యాదవ్‌ను ఉద్దేశించి మాత్రమే మాట్లాడానన్నారు.ఓసీ, ఎస్సీ, ఎస్టీ ఎవరైనా వ్యక్తిగతంగా ఇలాంటి ఆరోపణలు చేస్తే తన స్పందన ఇదే విధంగా ఉంటుందని తెలిపారు. బీసీలంటే తనకు ఎంతో అభిమానమన్నారు. వైసీపీ లేకపోతే రాచమల్లు జీరో అని,10 వేల ఓట్లు కూడా రావంటూ వరదరాజులరెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని చెప్పారు. 2029 ఎన్నికల్లో తాను స్వతంత్రంగా పోటీ చేస్తానని, వరదరాజులరెడ్డి కూడా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు.వైసీపీ అధినేత జగన్,పార్టీ, కార్యకర్తలే తన బలమని, జగన్ లేకుంటే తాను సామాన్యుడినేనని రాచమల్లు పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా తనపై అనేక ఆరోపణలు చేసినా వాటిని రాజకీయ విమర్శలుగానే భావించి సమాధానం చెప్పానన్నారు. బీసీలను అడ్డుపెట్టుకుని రాజకీయంగా రెచ్చగొట్టే ప్రయత్నం చేయవద్దని ఎమ్మెల్యేను హెచ్చరించారు.తాను బీసీలను ఎప్పుడూ అవమానించలేదని,కులమతాలకు అతీతంగా మానవత్వంతోనే అందరినీ ఆదరిస్తానన్నారు. 2005లో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా,వరదరాజులరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 25, 26, 27, 28 వార్డుల్లో తన అనుచరులను గెలిపించుకున్నానని, అది తన రాజకీయ సామర్థ్యానికి నిదర్శనమని చెప్పారు.2024లో స్వతంత్రంగా పోటీ చేసి గెలిచే సామర్థ్యం ఉంటే టీడీపీ టికెట్ ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవి ఓసీ జనరల్‌కు వస్తే తన తరఫున రాఘవేంద్రరెడ్డిని స్వతంత్రంగా పోటీ చేయిస్తానని, ఎమ్మెల్యే తన కుమారుడిని పోటీ చేయించి ఎవరు గెలుస్తారో చూద్దామని రాచమల్లు సవాల్ చేశారు. రాజకీయ ప్రత్యర్థులు వేరు, వ్యక్తిగత శత్రుత్వం వేరని పేర్కొంటూ, ప్రజలు ఎవరినీ నమ్మి మోసపోవద్దని సూచించారు. తనతో సమావేశంలో ఉన్న పలువురు బీసీ నాయకులకు గతంలో ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించానని తెలిపారు. ఒక ఎస్సీ చిన్నారిని రష్యాలో చదివిస్తున్నానని పేర్కొన్నారు.గృహ నిర్మాణంలో అవినీతికి పాల్పడ్డానన్న ఆరోపణలను ఖండించిన రాచమల్లు, మెటీరియల్ ప్రక్కదారి పట్టిన ఘటనలు ఎమ్మెల్యే హయాంలోనే జరిగాయని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, వైసీపీ బీసీ నాయకులు భీమునిపల్లె నాగరాజు, సుబ్బయ్య, పన్నీటి కాశయ్య, యాలం శంకర్, గోపీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గోవిందవాడ అర్డీటి కాలనీలో 11 ఏళ్ల బాలుడు మృతి






**బొమ్మనహాల్ మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**మండల పరిధిలో గోవిందవాడ గ్రామ అర్డీటి కాలనీలో ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న గబుక చిన్న తిప్పేస్వామి చిన్న కుమారుడు అయిన జి.తిప్పేష్ (11) ఏళ్ల బాలుడు జ్వరంతో బాధపడుతూ బెంగళూరు సెయింట్ జాన్స్ మెడికల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు రెండు రోజులుగా జ్వరం రావడంతో అనుకోకుండా ఎక్కువ కావడంతో దగ్గరలో ఉన్న బళ్ళారి ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స కోసం శనివారం అడ్మిట్ కావడం జరిగింది, జ్వరం ఎక్కువ కావడంతో వెంటనే వైద్యులు బెంగళూరు కు రెఫర్ చేయడం జరిగింది,అక్కడ ఉన్న బెంగళూరు సెయింట్ జాన్స్ మెడికల్ హాస్పిటల్ లో ఆదివారం అడ్మిట్ కావడం జరిగిందన్నారు,అకస్మాత్తుగా వైద్యులు నోటి వెంట సోమవారం మరణ వార్త విన్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయి బోరన విలపిస్తూ కన్నీటి పర్యవంతమయ్యారు,వైద్యులు తెలిపిన వివరాలు మేరకు..అక్యూట్ ఎన్సెఫలైటిస్ సింద్రోమ్, అనుమానిత రికెట్సియల్ ఎన్సెఫలైటిస్ కారణంగా పరిస్థితి విషమించి,సెప్టిక్ షాక్‌కు గురై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు, అంతలోనే మరణవార్త తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారులు మల్లికార్జున,వీరన్న,మరియు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,రాజ్ కుమార్,ఉపాధ్యాయుడు దాసు నాయక్,సిఆర్పి,భాస్కర్,గ్రామ పెద్దలతో కలసి తిప్పేష్ ఇంటి దగ్గరికి చేరుకుని మృతి చెందిన తిప్పేసి భౌతిక కాయానికి పూలమాల వేస్తూ నివాళులర్పిస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు,జి. తిప్పేష్ మృతితో గోవిందవాడ ఆర్డిటి కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.


# రేషన్ దుకాణాల్లో సమాచార బోర్డులు, మోదీ చిత్రపటం ఏర్పాటు చేయాలి

### - పులివెందుల మండల బీజేపీ అధ్యక్షుడు వై.నవీన్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 01:-** పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ రేషన్ దుకాణాల్లో పూర్తి పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ పులివెందుల మండల అధ్యక్షుడు వై.నవీన్ స్థానిక రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూప్రతి రేషన్ దుకాణంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వాటాలను స్పష్టంగా తెలియజేసే సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాన్ని రేషన్ షాపుల్లో ప్రదర్శించాలని డీలర్ పేరు,మొబైల్ నంబర్ బోర్డుపై స్పష్టంగా కనిపించేలా ఉంచాలన్నారు.నిత్యావసర సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా,సరైన తూకంతో కార్డుదారులకు సరుకులు అందేలా అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలి.ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపాల్ రెడ్డి,మాజీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి మూర్తి శ్రీరాములు,బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు వాజ్పేయి నాయుడు,రక్షిత్,శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో యాగశాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో యజ్ఞ యాగాదులు నిర్వహించేందుకు నూతనంగా నిర్మించిన యాగశాల ప్రారంభోత్సవం సోమవారం, సెప్టెంబర్ 7న ఉదయం 9 గంటలకు జరగనుంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.లోక క్షేమం,ప్రజల శ్రేయస్సు కోసం నిర్వహించే యజ్ఞ యాగాదులను యాగశాలలో నిర్వహించడం వల్ల విశేషమైన ఫలితాలు లభిస్తాయని ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి,పాలకమండలి సభ్యులు, ఆలయ అర్చకులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆలయంలో యాగశాల నిర్మాణానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, వెంటనే నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు యాగశాల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా యాగశాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డితో పాటు ఆయన కుమారుడు నంద్యాల కొండారెడ్డిని ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి,పాలకమండలి సభ్యులు,ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు.ప్రజల శ్రేయస్సు, భగవంతుని సేవకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొంటూ,యాగశాల ప్రారంభోత్సవానికి తప్పక హాజరవుతానని తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.

# జిమ్ ట్రైనర్ సతీష్ రెడ్డి హత్యపై ఎందుకీ మౌనం..?

● కటౌట్ శ్రీను పాత్ర పై నోరు మెదపరెం..? ● నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి ● కాకినాడలో అదుపుతప్పిన శాంతి భద్రతలు ● ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి



**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**ప్రశాంతతకు మారుపేరైన కాకినాడలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని వైఎస్ఆర్సిపి కాకినాడ సిటీ కో ఆర్డినేటర్ , మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నగర నడిబొడ్డున భానుగుడి సెంటర్ లో జిమ్ ట్రైనర్ సతీష్ రెడ్డి దారుణ హత్య ఇందుకు ప్రధాన నిదర్శనమన్నారు. సతీష్ రెడ్డి హత్య వెనుక టిడిపి నాయకుడు కటౌట్ శ్రీను పాత్ర ఉందని సతీష్ రెడ్డి భార్య జయశ్రీ స్వయంగా ఆరోపించినప్పటికీ ఇప్పటివరకు పోలీసులు ఎందుకు చర్య తీసుకోలేదని ద్వారంపూడి ప్రశ్నించారు. అతని వెనుక ఉన్న రాజకీయ శక్తులు ఎవరు? కటౌట్ శ్రీను పై చర్యల విషయంలో పోలీసులు ఎందుకు తాత్సారం చేస్తున్నారు? హత్య జరిగి వారం రోజులు గడుస్తున్న ఇప్పటివరకు చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనకాడుతున్నారు ? ఎవరి ఒత్తిడి వల్ల నిందితులను కాపాడుతున్నారు? అంటూ ద్వారంపూడి ప్రశ్నలు సంధించారు. ఒక్క సతీష్ రెడ్డి హత్య కాకుండా...గడచిన కొద్ది రోజులుగా కాకినాడలో శాంతిభద్రతల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు.విచ్చలవిడిగా హత్యలు,దౌర్జన్యాలు, అరాచకాలు జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోలేని నిస్సహాయ పరిస్థితికి కారణమేమిటిని నిలదీశారు. మృతుడు సతీష్ రెడ్డి భార్య జయశ్రీ గర్భవతిగా ఉండి కూడా స్వయంగా బయటకు వచ్చి ఆందోళన చేసి నిందితుల పేర్లు బహిరంగంగా ప్రకటిస్తున్న చర్యలు తీసుకోకపోవడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆయన పేర్కొన్నారు. తక్షణమే ఆరోపణలు ఎదుర్కొంటున్న కటౌట్ శ్రీను, ఇతర నిందితులను అరెస్టు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలని ద్వారంపూడి డిమాండ్ చేశారు. నేరాలను అదుపు చేసే విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే పరిస్థితి మరింత అదుపుతప్పి ప్రశాంత కాకినాడ...అశాంతికి నిలయంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలవొగ్గి నిందితులను కాపాడాలని చూస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# సీఆర్‌పీ శ్రీరాములుకు ఘనంగా పదవీ విరమణ సన్మానం

**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**రాయచోటి మండలం మాధవరం జడ్పీహెచ్ఎస్‌లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా (సీఆర్పీ) పనిచేసిన మల్లూరు శ్రీరాములు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రియాజ్, మండల విద్యాశాఖాధికారి బాలాజీ నాయక్, ఎంఈఓ2 నాగమునిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎంఈఓ బాలాజీ నాయక్ మాట్లాడుతూ శ్రీరాములు మృదుస్వభావి అని, ఉపాధ్యాయులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ తనకు అప్పగించిన బాధ్యతలను ఎలాంటి సమస్యలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఎంఈఓ2 నాగమునిరెడ్డి మాట్లాడుతూ ఏ పని అప్పగించినా వెనుకాడకుండా పూర్తి చేసి మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తి శ్రీరాములు అని అన్నారు.ప్రధానోపాధ్యాయులు రియాజ్ మాట్లాడుతూ శ్రీరాములు నిరంతరం శ్రమించే వ్యక్తి అని, విద్యాశాఖలో తన సేవల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అనంతరం శ్రీరాములును ఘనంగా సన్మానించి, పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ అధ్యక్షులు శివారెడ్డి, ఏపీ యూఎస్ సభ్యులు ఎన్.శ్రీనివాసులు,ఎన్‌టీఏ అధ్యక్షులు అమర, ఉపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# నూతన విద్యా బోధకులు సమయపాలన పాటించాలి



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**చిట్వేలి మండలంలోని పాఠశాలలలో నూతనంగా విద్యా బోధకులుగా చేరిన వారు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని చిట్వేలి మండల విద్యాశాఖ అధికారి ఖాజా మొహిదీన్, ఈశ్వరయ్య లు సూచించారు.చిట్వేలి మండలంలో ప్రాథమిక పాఠశాలలలో 41మంది, చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నలుగురు పాఠశాల సహాయ విద్యా బోధకులు విధులలో చేరారు. వారికి కేటాయించిన ప్రాథమిక,ఉన్నత పాఠశాలల్లో విధులు బాధ్యతాయంగా నిర్వహించాలని సూచించారు.కొత్తగా విధుల్లో చేరుతున్న నూతన విద్యా బోధకులు సమయపాలన పాటిస్తూ పాఠశాలలోని విద్యార్థులలో సమగ్ర విద్యాభివృద్ధి పెంపొందించుటకు కృషి చేయాలని కోరారు.తద్వారా గ్రామంలో మంచి పేరు తెచ్చుకోవాలని తెలియజేశారు.ప్రభుత్వం నూతనంగా విద్యా బోధకులను నియమించడం వలన మండలంలో టీచర్ల కొరత చాలావరకు తీరినట్లు అయింది.

# వక్ఫ్ పరిరక్షణ కమిటీ సభ్యుడిగా సీనియర్ న్యాయవాది ఎండి.హుస్సేన్ నియామకం



**కూకట్‌పల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, సమన్వయ కమిటీ సభ్యుడిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది అడ్వకేట్ ఎండి. హుస్సేన్ నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ ఆయనను కమిటీ సభ్యుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లా పరిధిలోని వక్ఫ్ భూములు, ఆస్తుల పరిరక్షణతో పాటు అక్రమ ఆక్రమణలను అరికట్టడం, వక్ఫ్ సంస్థల హక్కులను కాపాడటం, సంబంధిత సమస్యలపై సమన్వయంతో చర్యలు తీసుకోవడం కమిటీ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్‌కు ఎండి. హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణతో పాటు సమాజ సంక్షేమానికి కట్టుబడి,తన బాధ్యతలను అంకితభావంతో,నిష్పక్షపాతంగా నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రెండు జింకలు మృతి



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**పుల్లంపేట మండలంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు జింకలు మృతి చెందాయి. పుల్లంపేట మండలం అనంతసముద్రం సమీ పంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రెండు జింకలు మృతి చెందాయి.సమాచారం అందుకున్న పోలీసులు, అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన జింకలను పరిశీలించి, ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. జింకలను ఢీకొన్న వాహనం ఆచూకీ కోసం అధికారులు చర్యలు చేపట్టారు.అటవీశాఖ అధికారులు మృతి చెందిన జింకలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించారు.

# సీఎం సార్..పీఆర్సీ,డీఏ బకాయిలు విడుదల చేయండి




**దేవనకొండ మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలోని ఉద్యోగ సంఘాలు దేవనకొండ మండలంలో నిరసన చేపట్టాయి. "సీఎం సార్.. పీఆర్సీ, డీఏ బకాయిలు విడుదల చేయండి" అంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు.ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలతో పాటు కరువు భత్యం (డీఏ), పీఆర్సీ, మధ్యంతర భృతి (ఐఆర్), ఇతర అలవెన్సులను తక్షణమే విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే కొత్త పీఆర్సీ కమిటీ ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవనకొండ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ శాఖకు చెందిన వై.కె.రామేశ్వర్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, రవి పాల్గొన్నారు.

మనజనప్రగతి

02- 09 - 2026

## రామాపురం మండల మాదిగ దళ పోరాట సమితి అధ్యక్షుడిగా అగ్రహారం రాణా ప్రతాప్



**రామాపురం మన జనప్రగతి సెప్టెంబర్ 01:–**అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ పరిధిలోని రామాపురం మండల మాదిగ దళ పోరాట సమితి అధ్యక్షుడిగా అగ్రహారం రాణా ప్రతాప్ నియమితులయ్యారు. సమితి రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యుల ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.మండల పరిధిలో సంస్థ బలోపేతానికి, దళిత హక్కుల సాధనకు రాణా ప్రతాప్ నిరంతరం కృషి చేయాలని జిల్లా కమిటీ ఆకాంక్షించింది. తన నియామకానికి సహకరించిన సమితి రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్, జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి అశోక్ కుమార్ మరియు రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు రాణా ప్రతాప్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, మండలంలో సమితి బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.


## రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న హితేష్ రాయల్




**పులివెందుల మన జనప్రగతి సెప్టెంబర్ 01:–**జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందులలో హితేష్ రాయల్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ హితేష్ రాయల్ కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయంలో రక్తం అందక ఎవరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. రక్తదానం ఒక ప్రాణానికి మరో అవకాశం కల్పించే గొప్ప సేవ అని అన్నారు.యువత సేవా కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొని సమాజానికి తమ వంతు సహకారం అందించాలని హితేష్ రాయల్ పిలుపునిచ్చారు.

## శ్రీధరగట్టలో ఉపాధ్యాయుడు శ్రీధర్ పదవీ విరమణ

### - ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికిన ఎంఈఓ మల్లికార్జున,ఉపాధ్యాయులు



**బొమ్మనహాళ్ మన జనప్రగతి సెప్టెంబర్ 01:–**మండల పరిధిలోని శ్రీధరగట్ట గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఎం.టి.ఎస్ ఉపాధ్యాయుడిగా సేవలందించిన ఎస్. శ్రీధర్ మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి వి. మల్లికార్జున హాజరై శ్రీధర్ ఉపాధ్యాయ వృత్తిలో అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థుల పట్ల ఆయన చూపిన ప్రేమాభిమానాలతో పాటు, వారి విద్యాభివృద్ధికి చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం శ్రీధర్‌ను శాలువాతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో శ్రీధరగట్ట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశానికి విశేష స్పందన

### •ప్రజల పక్షాన నిలిచే పార్టీ కాంగ్రెస్:బండి జకరయ్య



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 01:–**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి ఎన్.డి. విజయజ్యోతి ఆదేశాల మేరకు కడప నగరంలోని 35వ డివిజన్‌లో మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. 35వ డివిజన్ నాయకులు సమీవుల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి జకరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, ప్రజోపయోగకరమైన చట్టాలను అందించిందన్నారు. ఆధార్, సమాచార హక్కు చట్టం వంటి ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థలు, చట్టాల రూపకల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కడప నగర అభివృద్ధిలోనూ కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి ఎంతో ఉందని, నగరంలో ప్రస్తుతం ఉన్న అనేక ముఖ్యమైన కార్యాలయాలు, మౌలిక వసతులు కాంగ్రెస్ పాలనలోనే ఏర్పడ్డాయని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ప్రజల పక్షాన నిలుస్తుందని, ప్రజలంతా పార్టీకి అండగా నిలవాలని ఆయన కోరారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఘన విజయం అందించాలని పిలుపునిచ్చారు. 35వ డివిజన్‌లో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి సమీవుల్లా నాయకత్వాన్ని బలోపేతం చేయాలని, ఆయనకు అత్యధిక మెజారిటీతో విజయం అందించాలని కోరారు.కార్యక్రమంలో సుధాకర్, సురేంద్ర, వన్నూరు సాబ్, ఆదాము, జహూర్ అహ్మద్, దినకర్, టి.సి. రాయుడు, సంతోషమ్మ, కటిక జిలాన్ భాష, అబూతలహా, మహబూబ్ బాషా, మహమ్మద్ హుస్సేన్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కౌట్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందుతుంది

### •సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ అనురాధ




**రాయచోటి మన జనప్రగతి సెప్టెంబర్ 01:–**స్కౌట్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం, బాధ్యతాయుత ప్రవర్తన పెంపొందుతాయని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ అనురాధ తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలలకు మంజూరైన నిధులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.రాయచోటి డైట్ కళాశాలలో అన్నమయ్య జిల్లాలోని 39 పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో నిధుల వినియోగంపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను సకాలంలో, సమర్థవంతంగా బదిలీ చేసేందుకు రూపొందించిన ప్రత్యేక విధానంపై అవగాహన కల్పించారు.రూ.50 వేల నిధులను యూనిఫామ్‌లు, విద్యార్థుల శిక్షణ, స్కౌట్ మాస్టర్, గైడ్ కెప్టెన్ శిక్షణ, స్కౌట్‌గైడ్ బోర్డు ఏర్పాటుకు నిబంధనల మేరకు ఖర్చు చేయాలని వనరుల వ్యక్తి చెరుకూరి బాలాజీ వివరించారు. బిల్లుల ఆన్‌లైన్ సమర్పణ, విక్రేత ఖాతా ఏర్పాటు తదితర ప్రక్రియలపై ప్రాయోగిక శిక్షణ ఇచ్చారు.జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా సంఘం కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సహాయ ఏఎంఓ నాదిర్షా, కోశాధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఇతర అధికారులు, ప్రధానోపాధ్యాయులు, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు, జెట్టింగ్ మిషన్ వాహనాలు ప్రారంభించిన మంత్రి నారాయణ



**నెల్లూరు, మన జనప్రగతి సెప్టెంబర్ 01:–**నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 46వ డివిజన్ జొన్నలగడ్డవారి వీధిలో రూ.28.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రారంభించారు. అనంతరం కార్పొరేషన్ రూ.1.20 కోట్లతో కొనుగోలు చేసిన రెండు యూడీజీ జెట్టింగ్ మిషన్ వాహనాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నెల్లూరు సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నగరాన్ని దోమల రహితంగా తీర్చిదిద్దేందుకు యూడీజీ వ్యవస్థను విస్తరిస్తున్నామని తెలిపారు. 13వ డివిజన్‌లో రూ.250 కోట్లతో యూడీజీ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలు యూడీజీ కనెక్షన్లు తీసుకుని సహకరించాలని కోరారు.యూడీజీ కనెక్షన్ రుసుమును రూ.10 వేల నుంచి రూపాయికి తగ్గించామని, నెలకు రూ.1,000లోపు పన్ను చెల్లించే వారికి ఉచితంగా, రూ.2,000లోపు పన్ను చెల్లించే వారికి 50 శాతం రాయితీతో కనెక్షన్లు ఇస్తామని మంత్రి తెలిపారు. రుసుమును ఐదేళ్లలో పది వాయిదాల్లో చెల్లించే అవకాశం కల్పించామన్నారు.కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యోగా పోటీల్లో చిన్నారి నిథాలీ జైన్ ప్రతిభ

### - జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించి ఆదోనికి పేరు ప్రతిష్ఠలు





**ఆదోని మన జనప్రగతి సెప్టెంబర్ 01:–**యోగా పోటీల్లో ఆదోనికి చెందిన చిన్నారి నిథాలీ జైన్ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. విశాఖపట్నంలో నిర్వహించిన 51వ జాతీయ యోగా పోటీల్లో పాల్గొన్న నిథాలీ జైన్ మూడో స్థానం సాధించి ఆదోనికి మంచి పేరు తీసుకొచ్చింది.ఆదోని లీలావతి కళాశాలలో ఆరో తరగతి చదువుతున్న నిథాలీ జైన్ చిన్న వయసులోనే యోగాలో ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిథాలీ జైన్‌ను అభినందిస్తూ ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## మనబడిమన భవిష్యత్తు అభివృద్ధి పనులను పరిశీలించిన మండల విద్యాశాఖ అధికారి,మల్లికార్జున



**బొమ్మనహాల్ మన జనప్రగతి సెప్టెంబర్ 01**:మండల పరిధిలో గోవిందవాడ గ్రామ ప్రాథమిక పాఠశాల ఆర్డిటి కాలని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మనబడిమన భవిష్యత్తు అభివృద్ధి పనులను, మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున పరిశీలించారు, అనంతరం పాఠశాలలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించి, పనులను నిర్ణీత ప్రమాణాలతో నాణ్యతగా పూర్తి చేయాలని,ప్రధానోపాధ్యాయులకు సూచించారు,అదేవిదంగా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, పాఠశాలలో మౌలిక వసతులు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజకుమార్,ఉపాధ్యాయులు దాస్ నాయక్,సిఆర్పి,భాస్కర్ పాఠశాల కమిటీ చైర్మన్, పాల్గొన్నారు.

## షేక్ నసీమ్‌కు వైవీయూ డాక్టరేట్



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 01:–**యోగి వేమన విశ్వవిద్యాలయం బోటనీ స్కాలర్ షేక్ నసీమ్ కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ను ప్రకటించింది.పరిశోధకురాలు బోటనీ శాఖ ఆచార్యులు షా వల్లీ ఖాన్ పర్యవేక్షణలో న్యూట్రీషనల్ కంపోజిషన్ అండ్ జనరేషన్ ఆఫ్ డబుల్డ్ హాప్లాయిుఆఫ్ లైట్స్ ఇన్ మొమోర్డికా సైంబలేరియా హూక్ ఎఫ్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి మార్గదర్శకాలతో నియమితులైన పరీక్షకుల బోర్డు, వైవా వోస్ కమిటీ సిఫారసుల ఆధారంగా షేక్ నసీమ్ డాక్టరేట్ కు అర్హత ఉన్నట్లు ప్రకటించారు.ఈ మేరకు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య టీ. లక్ష్మీ ప్రసాద్ స్కాలర్ నసీమ్ కు పీహెచ్డీ నోటిఫికేషన్ ప్రకటించారు.షేక్ నసీమ్ రాసిన పరిశోధన పత్రాలు పలు జాతీయ,అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి.ఈమె ఎమ్మెస్సీ బోటనీ లో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు,పీహెచ్‌డీ పరిశోధన సమయంలో ప్రతిష్టాత్మకమైన జాతీయ ఇన్స్పైర్ ఫెలోషిప్ ను పొందారు.డాక్టరేట్ అందుకున్న సందర్భంగా నసీమ్ ను అధ్యాపకులు,స్కాలర్లు,విద్యార్థులు అభినందించారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలు జి.వినుతను అభినందించిన జిల్లా విద్యాశాఖాధికారి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 01:–** కర్నూల్ జిల్లా,పత్తికొండ మండలం,హోసూరు ఎంపీపీ మెయిన్ స్కూల్ లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ జి.వినుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై, ఫిన్లాండ్ దేశంలో నిర్వహించిన అంతర్జాతీయ విద్యా పర్యటనలో పాల్గొని, ఉత్తమ విద్యా విధానాలపై అధ్యయనం చేసి స్వదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా ఆమెను జిల్లా విద్యాధికారి సుధాకర్ అభినందించారు. శ్రీమతి జి. వినుతను జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్ అభినందించారు.ఈ సందర్భంగా ఫిన్లాండ్ పర్యటనలో ఆమె అధ్యయనం చేసిన ప్రాథమిక బాల్య విద్య, ప్రాథమిక విద్యలో ఆనందం, ఆటల ద్వారా అభ్యసనం, విద్యార్థి కేంద్రిత బోధనా విధానాలు వంటి అంశాలను వినుతను అడిగి తెలుసుకున్నారు.అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ విద్యా విధానాలను పరిశీలించి, వాటిలో మన రాష్ట్ర విద్యా విధానంలో సరిపడు అంశాలు విద్యార్థులకు అందించేందుకు కృషి చేయడం జరుగుతుంది అని డీఈవో సుధాకర్ అన్నారు.అనంతరం ఉపాధ్యాయురాలు వినుతకు ప్రశంసా పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యా రంగంలో వినూత్న బోధనా పద్ధతులతో మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ మండల విద్యాధికారి వి.మాలతి,డైట్ ఫిజికల్ డైరెక్టర్ ఏ.రాజేష్,డి.రమేష్ విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొని జి. వినుతకు అభినందనలు తెలిపారు.

## అవ్వాతాతల కళ్లలో ఆనందం చూస్తుంటే సంతోషంగా ఉంది: మంత్రి నారాయణ



**నెల్లూరు, మన జనప్రగతి సెప్టెంబర్ 01:–** నెల్లూరు 6వ డివిజన్ ఉడ్ హౌస్ సంఘంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం వేడుకలా జరిగింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదును అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక మహిళలు మంగళహారతులతో మంత్రికి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు హామీ మేరకు వృద్ధులు, వితంతువులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000, పూర్తి వికలాంగులకు రూ.15,000, కిడ్నీ, కాలేయ వ్యాధిగ్రస్తులకు రూ.10,000 పింఛన్‌ను ప్రతి నెలా 1వ తేదీనే ఇంటి వద్ద అందిస్తున్నామని తెలిపారు. 62 లక్షల కుటుంబాలకు ఏటా రూ.33 వేల కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు.సీఎం చంద్రబాబు అనుభవంతో ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్నారని మంత్రి నారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సింటెక్స్,డ్రైనేజిలు నిర్మించాలి.

● సీఐటీయూ,వ్యవసాయ కార్మిక సంఘం.



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 01:-** రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో పొదలపల్లి మాల వాడ నందు 30 కుటుంబాలు నివాసం ఉన్నాయని వెంటనే సింటెక్స్ డ్రైనేజి లు నిర్మించాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యం సుధీర్ కుమార్ సీఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పొదలపల్లి మాలవాడ సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరుల తో వారు మాట్లాడుతూ...ప్రభుత్వం మాలవాడ కు ఒక బోర్ ఏర్పాటు చేశారని అయితే విద్యుత్ హెచ్చు తగ్గుదల సరఫరా కారణంగా మోటార్ కాలిపోతే దాదాపు నెల పాటు పట్టించుకునే వారు లేరని దీంతో పనులు మానుకొని పక్క గ్రామాలకు వెళ్లి నీరు తెచ్చుకున్న పరిస్థితి ఉన్నదన్నారు.ఉన్న బోర్ కు 5000 లీటర్ల కెపాసిటి ఉన్న సింటెక్స్ ఏర్పాటు చేసి నీటి ఎద్దడి నివారణకు కృషి చేయాలన్నారు.డ్రైనేజి లేని కారణంగా ఇంటి మురుగు ఇంటి ముందరే నిల్వ ఉంటున్నదని అనేక రోగాలు వస్తున్నట్లు తెలిపారు. వెంటనే డ్రైన్స్ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికార యంత్రాంగాన్ని కోరారు.ఈ కార్యక్రమం లో గ్రామప్రజలు పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల గుండె చప్పుడు వైఎస్సార్

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెలుగు ప్రజల గుండె చప్పుడని, అభివృద్ధి, సంక్షేమానికి ఆయన చూపిన మార్గం చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆరోగ్యశ్రీ, 108, 104, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, గృహ నిర్మాణం వంటి పథకాలతో పేదల జీవితాల్లో వైఎస్సార్ వెలుగులు నింపారని పేర్కొన్నారు.వెలిగల్లు, జరికోన, శ్రీనివాసపురం ప్రాజెక్టులు ప్రాంత అభివృద్ధిలో కీలకమని, రాయచోటి ప్రాంతంపై వైఎస్సార్‌కు ప్రత్యేక అభిమానం ఉండేదని తెలిపారు. నీటి పథకాలతో పాటు రింగ్ రోడ్డు, పాలిటెక్నిక్ కళాశాల, విద్యాసంస్థల ఏర్పాటుకు ఆయన కృషి చేశారని గుర్తుచేశారు. రైతులు, పేదల సంక్షేమానికి విశేషంగా కృషి చేసిన వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.వైద్యం, విద్య, వ్యవసాయం, సాగునీరు, పేదల సంక్షేమం వంటి అన్ని రంగాల్లో వైఎస్సార్ చేసిన సేవలు ఆదర్శప్రాయమని శ్రీకాంత్‌రెడ్డి కొనియాడారు. రైతును రాజుగా చూడాలన్నదే ఆయన ఆశయమని, పేదలకు భరోసా కల్పించిన నాయకుడిగా ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.వైఎస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. వెలిగల్లు, శ్రీనివాసపురం, జరికోన ప్రాజెక్టుల జలాలతో నియోజకవర్గంలోని వైఎస్సార్ విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించి మహానేతకు ఘన నివాళులర్పించాలని ప్రజలు, పార్టీ శ్రేణులను గడికోట శ్రీకాంత్‌రెడ్డి కోరారు.

# రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలి

● వేంపల్లె ఏవో బాలగంగాధర్ రెడ్డి




**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**ఎలిని నో కారణంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు తక్కువ నీటితో పండే ఆరుతని పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎద్దుల బాలగంగాధర్ రెడ్డి సూచించారు. మండలంలోని ముత్తుకూరు, అలవలపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పొలాల్లోకి వెళ్లి వారు సాగుచేసిన పత్తి ఇతర పంటలను స్వయంగా పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు అందించారు. పంటలకు ఆశించిన తెగుళ్ళకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడమే కాకుండా ఈ -పంట తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. రైతులకు పలు రకాల ప్రయోజనాలు చేకూరాలంటే 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య అన్నసత్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి

- మాజీ మంత్రికి జ్ఞాపిక అందించిన వేంపల్లి ఆర్యవైశ్యులు

**వేంపల్లె మన జన ప్రగతి సెప్టెంబర్ 01:-**వేంపల్లి ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో నిర్వహిస్తున్న గండి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్యాన్ని మంగళవారం మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ సందర్శించారు. ఈ మేరకు సత్రం నిర్వాహకులు మంత్రికి ఘన స్వాగతం పలికి పలు విషయాలపై ఆయన తో చర్చించారు. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉండి దాతల విరాళాలతో గండి పుణ్యక్షేత్రంలో ఇంత భారీ అన్నసత్రాన్ని నిర్మించుకోవడం హర్షణీయమన్నారు. అనంతరం సత్రం అధ్యక్షుడు పచ్చిపులుసు మురళి కిషోర్ మాజీ మంత్రికి జ్ఞాపిక ను అందించారు.కార్యక్రమంలో అన్న సత్రం మాజీ అధ్యక్షుడు రాయవరం శివరావు,ఆర్యవైశ్య సంఘ నేతలు బిజిఎస్ గంగాధర్, పుల్లగూర అరవింద్, గోనుగుంట్ల హరి, మేడా ప్రదీప్, పోలేపల్లి సుమన్, చంటి సురేష్, దొంతు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# కడప రోడ్డులో 'చందమామ కేఫ్' ప్రారంభం


● నాణ్యమైన సేవలతో రాణించాలి: ఎంపీ అవినాష్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**పులివెందులలోని కడప రోడ్డు నందు నూతన హంగులతో రూపొందించినటువంటి చందమామ కేఫ్ ను జిల్లా ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో భాగంగా మంగళవారం ఉదయం కడప రోడ్డు పాలకేంద్రం ఎదురుగా మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప తన అనుచరులతో కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన చందమామ కేఫె జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పులివెందుల మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి,సివి దుష్యంత్ రెడ్డి మరియు ఇతర వైకాపా నేతలు అతిధులుగా పాల్గొని ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ మెరుగైన సేవలతో వినియోగదారుల ఆకాంక్షలను అందిపుచ్చుకొని వ్యాపారంలో రాణించాలని నిర్వాహకులకు అభినందనలతో కూడిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్,మైనార్టీ నేత ఓ. రసూల్,మాజీ కౌన్సిలర్లు కోడి రమణ,విజయ్ కుమార్ నాయుడు మరియు వైకాపా నేతలు మస్తాన్,చంద్రమౌళి మరి ఇతర వైకాపా శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరులో గంజాయి,మత్తు పదార్థాలపై పోలీసుల ప్రత్యేక నిఘా

- అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా..స్పెషల్ డ్రైవ్





**చెన్నూరు మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**చెన్నూరు పట్టణ పరిధిలో గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం ప్రత్యేక బృందాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.చెన్నూరు సీఐ షేక్ చాంద్ బాషా ఆధ్వర్యంలో లక్ష్మీనగర్, సరస్వతినగర్, పవర్ ఫ్యాక్టరీ, కొండపేట బ్రిడ్జి పరిసర ప్రాంతాలతో పాటు జనసంచారం తక్కువగా ఉండే అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి.చెన్నూరు పరిధిలోని అనుమానిత ప్రాంతాలపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని సీఐ చాంద్ బాషా తెలిపారు. గంజాయి లేదా ఇతర నిషేధిత మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిస్తే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై ఎఫ్.ఐ.ఆర్ ఉపసంహరించుకోవాలి: మాజీ ఎంపీ తులసి రెడ్డి



**వేంపల్లె మన జన ప్రగతి సెప్టెంబర్ 01:-**ఉత్తరాఖండ్ లోని బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత ఎంపీ రాహుల్ గాంధీ పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ తులసి రెడ్డి డిమాండ్ చేశారు.వేంపల్లి లో మంగళవారం పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ద్వానీలో రామ్ లీలా మైదానంలో ఆగస్టు 8వ తేదీన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే బహిరంగ సభ నిర్వహించగా ఆగస్టు 11వ తేదీన కొందరు బిజెపి నాయకులు అక్కడ శుద్ధీకరణ యజ్ఞం చేసి కుల వివక్షకు పాల్పడినారన్నారు .వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయమని రాహుల్ గాంధీ డిమాండ్ చేయగా రివర్స్ గేర్ లో రాహుల్ గాంధీ మీదనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దుర్మార్గం,అన్యాయమన్నారు.రాష్ట్రం లోని కూటమి ప్రభుత్వం కోతల,కూతల, వాతల ప్రభుత్వంగా తయారైందని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వ పాలనలో నిత్యావసర ధరలు ఆకాశం అంటుతున్నాయని పేదవాడు ఏమి కొని తినలేని పరిస్థితి నెలకొందన్నారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ వేముల మండల శాఖ అధ్యక్షుడు చాగలేటి వెంకటేశు,చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,బద్రీనాథ్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇడుపులపాయకు చేరుకున్న షర్మిల,విజయమ్మ

● వైయస్సార్ వర్ధంతికి ఏర్పాట్లు పూర్తి

● హాజరుకానున్న వైఎస్ కుటుంబ సభ్యులు

**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 01:-**పీసీసీ చీఫ్ వైయస్ షర్మిల,వైయస్సార్ సతీమణి విజయమ్మ మంగళవారం సాయంత్రం ఇడుపులపాయ కు చేరుకున్నారు. ఈ మేరకు వారు బుధవారం ఇడుపులపాయ లో నిర్వహించనున్న దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్ననున్నారు. మరోవైపు పులివెందుల పర్యటన లో ఉన్న వైకాపా అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి బుధవారం ఉదయాన్నే ఇడుపులపాయ కొచ్చి తన తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకల్లో పాల్గొననున్నారు. ఇందుకోసం వైఎస్ ఎస్టేట్ సిబ్బంది వైఎస్ఆర్ ఘాటు ఇతర ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకోసం పీసీసీ చీఫ్ షర్మిల, విజయమ్మలు బెంగళూరు నుంచి నేరుగా ఇడుపులపాయ కొచ్చారు. వారు రాత్రి అక్కడే బస చేసి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు అక్కడి వైయస్సార్ ఘాట్ లో జరిగే వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు, ప్రత్యేక ప్రార్థనల్లో వీరు పాల్గొంటారు. అలాగే పులివెందులలో ఉన్న జగన్ రాత్రి అక్కడే బస చేసి బుధవారం ఉదయం రోడ్డు మార్గం ద్వారా ఇడుపులపాయ కొచ్చి 7.45 గంటలకు వైఎస్ఆర్ ఘాట్ లో జరిగే తన తండ్రి వర్ధంతి వేడుకలు, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన రంగు రంగు ల పూలతో వైయస్సార్ ఘాటును తీర్చిదిద్దారు. మరోవైపు వీరన్న గట్టుపల్లి నుంచి ఇడుపులపాయ వరకు రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున వైఎస్ఆర్ కటౌట్లను ఏర్పాటు చేశారు.

# కూటమి ధర్మం పాటిస్తూనే జనసేన బలోపేతమే లక్ష్యం: మంత్రి దుర్గేష్



**నిడదవోలు మన జనప్రగతి సెప్టెంబర్ 01:-** కూటమి ధర్మాన్ని పాటిస్తూనే క్షేత్రస్థాయిలో జనసేనను బలోపేతం చేయడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం నిడదవోలు క్యాంప్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన ఆయన, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.సెప్టెంబర్ 2న డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నిడదవోలులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు కోటసత్తెమ్మ ఆలయం నుంచి రోటరీ క్లబ్ వరకు భారీ బైక్ ర్యాలీ, పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ ద్వారా జనసేన యువజన విభాగాన్ని పవన్ కళ్యాణ్ ఆవిష్కరించనున్నారని తెలిపారు.గ్రామ, మండల, వార్డు స్థాయిల నుంచి జనసైనికులు, వీరమహిళలు భారీగా తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.

# పేదల పక్షిపాతి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి మన జనప్రగతి సెప్టెంబర్ 01:-** ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. దేశంలోనే అత్యధిక పెన్షన్ ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకే దక్కుతుందని ఆయన తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లను ఆటోనగర్ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు లబ్దిదారులకు పంపిణీ చేశారు. నగరంలో 18 వేల 146 మందికి 8 కోట్ల రెండు లక్షలా యాభై వేల రూపాయలు ప్రతి నెలా అందిస్తున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. మూడు వేల నుంచి నాలుగు వేలకు పెన్షన్ ను ఒకేసారి పెంచి లబ్దిదారులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందిస్తున్నదని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం రెండు వేల నుంచి మూడు వేలకు పెంచేందుకు ఐదేళ్ళు తీసుకుందని ఆయన విమర్శించారు. పేదలను ఆర్థిక భరోసా కల్పించే చర్యల్లో భాగంగా ఎన్టీఆర్ భరోసా ను ప్రభుత్వం అమలు చేస్తున్నదని ఆయన తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటికి సమ ప్రాధాన్యత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ఇస్తున్నారని ఆయన చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోది సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ లు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పోరేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర హస్తకళల నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్ వర్మ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మాజీ కార్పొరేటర్ అన్నా అనిత, పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**• రక్తదానం చేసిన జనసేన నేత గోసుల ఆంజనేయులు**




**పులివెందుల మన జనప్రగతి సెప్టెంబర్ 01:**–జనసేన పార్టీ అధినేత,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందులలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా పులివెందుల మెడికల్ కాలేజీలో జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.జనసేన పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ హరీష్, హితేష్ రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో జనసేన నేత గోసుల ఆంజనేయులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌పై ఉన్న అభిమానంతో, ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానం చేసినట్లు తెలిపారు.రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలుగా నిలవవచ్చని, ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 2న పులివెందులలో జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు గోసుల ఆంజనేయులు తెలిపారు.అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# చేనేతలకు సకాలంలో ఆప్కో చెల్లింపులు



**అమరావతి మన జనప్రగతి సెప్టెంబర్ 01:–** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత సహకార సంఘాలకు ఆప్కో ద్వారా కొనుగోలు చేసిన వస్త్రాలకు సకాలంలో చెల్లింపులు చేస్తోంది. 24 నెలల్లో రూ.24.51 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేసి, పూర్తిస్థాయిలో చెల్లింపులు చేసింది.మొదటి ఏడాదిలో రూ.18.03 కోట్ల విలువైన వస్త్రాలకు రూ.18.02 కోట్లు, రెండో ఏడాదిలో రూ.6.61 కోట్ల వస్త్రాలకు పూర్తి స్థాయిలో చెల్లింపులు చేశారు. దీంతో చేనేత సంఘాలపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు నేతన్నలకు నిరంతర ఉపాధి లభించేలా చర్యలు చేపట్టారు.మంత్రి సవిత ఆదేశాల మేరకు వివిధ శాఖలు, గురుకులాలకు సరఫరా చేసిన చేనేత లివరీ వస్త్రాలకు సంబంధించి రూ.1.03 కోట్ల బకాయిలను మంగళవారం 20 చేనేత సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు. మిగిలిన బకాయిలను కూడా త్వరలో చెల్లించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.చేనేత సంఘాల ఆర్థిక బలోపేతం, ఆప్కో ద్వారా వస్త్రాల కొనుగోళ్లు, సకాలంలో చెల్లింపులపై మంత్రి సవిత ప్రత్యేక దృష్టి సారిస్తూ నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు.

# జీజీహెచ్‌లో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం:ఎంపీ తంగెళ్ళ



**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 01:**–కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)ను అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో కలిసి వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలోని ఖాళీ స్థలాలను వినియోగించుకుని పెద్దఎత్తున మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని, ఆసుపత్రి పరిసరాలను మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు.అదేవిధంగా, ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడకుండా ఆవరణలో అవసరమైన ప్రాంతాల్లో వెయిటింగ్ హాల్స్ నిర్మించాలని సూచించారు. ఇందుకోసం తన "ఎంపీ ల్యాడ్స్ నిధులతో పాటు కౌడా" నుంచి కూడా అవసరమైన నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఆసుపత్రి లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌడ చైర్మన్ తలాటం సత్య, జనసేన నాయకులు నన్ను దొరబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సుంకర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సహకారంతో 8వ వార్డులో నీళ్ళ మోటర్,స్టార్టర్ రెడీ




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 01:–** 8వ వార్డు లో నీళ్ళ మోటర్ చెడిపోయిన విషయము టీడీపీ నాయకులు జబీవుల్లా కు తెలిపిన వెంటనే అతను రాష్ట్ర రవాణా ,క్రీడ శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి,మౌర్య రెడ్డి ల దృష్టికి తీసుకునిపోవడం జరిగింది వెంటనే స్పందిస్తూ మంత్రి వర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి కొత్త స్టార్టర్ మరియు కొత్త బోరును పంపించి తక్షణమే నీళ్ళు వచ్చేటట్లు చేసినందుకు 8 వ వార్డు ప్రజలు మంత్రి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 8 వ వార్డు టిడిపి నాయకులు జబీవుల్లా,షేక్.ఇందాద్ అహమ్మద్,అబ్దుల్ సలాం,రహమతుల్లా,నాసర్ ఖాన్,సత్తార్,షేక్ కరీముల్ల మరియు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సమాచారం ఇస్తే బహుమతి

**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబరు 01:**–గంజాయి అక్రమ రవాణా,విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం అందించి సమాజ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ పిలుపునిచ్చారు.మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం 'రైజ్ ఎగైనెస్ట్ గంజా' పేరుతో విద్యార్థులు, యువత, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతోపాటు కుటుంబ,సామాజిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసులు, విద్యార్థులు, యువత, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. 'రైజ్ ఎగైనెస్ట్ గంజా'




పోస్టర్‌ను విడుదల చేశారు.గంజాయికి సంబంధించిన సమాచారాన్ని అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, విలువైన సమాచారం అందించిన వారికి తగిన బహుమతి అందజేస్తామని తెలిపారు.గంజాయి సమాచారం కోసం 1972, అత్యవసర పోలీసు సేవల కోసం 112, కాకినాడ పోలీసు వాట్సాప్ నంబర్ 9494933233కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులు,



స్థానిక ప్రజలు, పోలీసు అధికారులు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటా మని, వాటి నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, వివిధ పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు, ప్రజలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అవ్వ తాతల కళ్ళల్లో ఆనందమే చంద్రబాబునాయుడు ధ్యేయం.

**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు గాజుల కాదర భాష..**

**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 01:**–అవ్వ తాతల ఆనందమే చంద్రబాబు నాయుడు ధ్యేయమని గాజుల ఖాదర్ భాష పేర్కొన్నారు.. మంగళవారం నాడు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు ఐటి విద్యాశాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ బాబు ఆదేశాలతో మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గౌరవ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి తమ్ముడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి సూచన మేరకు గాజుల ఖాదర్ బాషా సచివాలయ సిబ్బందితో కలిసి వీరభద్ర స్వామి దేవాలయం వీధి నందు నా దా న వీధి నందు ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేకపోయినా గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు అప్పుల ఆంధ్ర ప్రదేశ్



గా మార్చారని ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రతినెల 1వ తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కి ఒక్కరికే దక్కుతుందని తెలిపారు ఒకటవ తేదీ ఆదివారం వస్తే లేదా ఏదైనా సెలవు దినం వస్తే ఒకటవ తేదీ ముందుగానే పెన్షన్లు అందించడం చరిత్రలో ఎక్కడ కూడా ఏ ప్రభుత్వం కూడా చేయలేదని తెలిపారు వృద్ధులు వితంతువులు, వికలాంగులు వారు సంతోషంగా ఉండాలి అని ఎన్ని అడ్డంకులు వచ్చినా కూడా అన్ని అతిక్రమిస్తూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందివ్వడం జరుగుతుందని తెలిపారు 18 రకాల పెన్షన్లు ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే ఆ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కరే అని తెలిపారు చంద్రబాబు నాయుడు పరిపాలనలో రాష్ట్రంలో ప్రతి ఒక్కరు హాయిగా సంతోషంగా బ్రతుకుతున్నారని ఎక్కడ కూడా అవినీతి అక్రమాలకు తావు ఇవ్వకుండా ప్రజా రంజకమైన పరిపాలనను కూటమి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు ఇచ్చిన మాట ప్రకారంగా తల్లికి వందనం ఉచిత బస్సు ప్రయాణం దీపం పథకం కింద ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఆటో వారికి సంవత్సరానికి 15000 చేనేత వర్గానికి నేతన్నలకు 200 యూనిట్లు ఉచితమైన విద్యుత్తు మరమగ్గాలు అల్లేవారికి ఉచితంగా 500 యూనిట్లు విద్యుత్తు అందిస్తున్న ఘనత కూడా చంద్రబాబు నాయుడు కి దక్కుతుందని తెలిపారు.

# తొండూరులో డిజిటల్ సేవలకు కొత్త బాట

**ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యం**

**జిల్లా మేనేజర్ సిగా సుబ్రహ్మణ్యం**

**తొండూరు మన జనప్రగతి సెప్టెంబర్ 01:**–తొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్ల వెరిఫికేషన్ ప్రక్రియను కడప జిల్లా కామన్ సర్వీస్ సెంటర్ మేనేజర్ సిగా సుబ్రహ్మణ్యం పూర్తి చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల పనితీరు, మౌలిక సదుపాయాలు, ప్రజలకు అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను ఆయన పరిశీలించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా, వేగంగా అందించడంలో కామన్ సర్వీస్ సెంటర్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆధార్, పాన్




కార్డు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు, ధృవపత్రాలు, బ్యాంకింగ్, బీమా తదితర డిజిటల్ సేవలు స్థానికంగానే పొందే అవకాశం ఉందన్నారు.కేంద్రాల్లో అవసరమైన పరికరాలు, ఇంటర్నెట్ సదుపాయం, సేవల నిర్వహణ తీరును పరిశీలించిన ఆయన నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు డిజిటల్ సేవలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత మందికి చేరువ అవుతాయని పేర్కొన్నారు.తొండూరు మండలంలో మరిన్ని డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడంతో రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, స్థానిక ప్రజలకు ప్రయోజనం కలగనుందని సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను ఇంటి ముంగిటకు తీసుకురావడంలో కామన్ సర్వీస్ సెంటర్లు వారధిగా నిలుస్తాయని అన్నారు.

# పులివెందుల పర్యటనలో వైకాపా అధినేత

**స్థానిక ఎన్నికలే లక్ష్యంగా శ్రేణులకు దిశానిర్దేశం**

**కూటమి వైఫల్యాలను ఎండగట్టండి,కార్యకర్తలకు అండగా ఉంటాం**

**మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి సెప్టెంబర్ 01:** దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం పులివెందులకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణులు,ప్రజలు ఘన స్వాగతం పలికారు. భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన స్వయంగా ప్రజలు, కార్యకర్తలను పేరుపేరునా పలకరిస్తూ వినతులను స్వీకరించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో గ్రామ,వార్డు స్థాయిల్లో పటిష్ట కార్యాచరణ రూపొందించుకోవాలని



సూచించారు.కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు,వైఫల్యాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ప్రతిపక్ష పార్టీ శ్రేణులపై అధికార పార్టీ సాగిస్తున్న బెదిరింపులు, దౌర్జన్యాలను ధీటుగా ఎదుర్కొంటామని, కార్యకర్తలకు పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ చేకూరిన మేలును ప్రజలకు వివరించాలని శ్రేణులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి,వైఎస్ మనోహర్‌రెడ్డిలతో పాటు పలువురు రాష్ట్ర,జిల్లా స్థాయి నేతలు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174